
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 21 ఏప్రిల్ 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	43.8	25.7
భద్రాద్రి	40	22



ఖమ్మంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో 75 కేజీల కేకును కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా బాబు జన్మదిన వేడుకలు

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ పుట్టినరోజును శనివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో కేతినేని హరీష్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం తదితరులు కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత 75 కేజీల కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో టీడీపీ నాయకులు మల్లెంపాటి అప్పారావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఖమ్మం నగరంలోని జలాంజనేయస్వామి ఆలయంలో కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.




మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

ఖర్చులను తప్పనిసరిగా చూపాలి

పరిశీలకులు అరుణ్‌ప్రసాత్ కృష్ణస్వామి, శంకర్ నంద్ మిశ్రా

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఖర్చుల లెక్కలు పకడ్బందీగా నమోదు చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకరనంద్ మిశ్రాలు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల్లో ధనం, మద్యం, ప్రలోభాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. లోకసభ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థికి రూ.95 లక్షల ఖర్చు పరిమితి ఉందన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుంచి ఖర్చు ఖాతాలో చూపాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, రేడియో, సోషల్ మీడియా తదితర మాధ్యమాల్లో ప్రచార ఖర్చంతా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ర్యాలీలు, సభలు, వాహనాల ద్వారా ప్రచారంపై నిఘా పెట్టాలన్నారు. ప్రచారానికి, వివిధ అనుమతులకు అయిన ఖర్చు అభ్యర్థికి తెలియజేయాలని, ఖర్చు రిజిస్టర్లు అభ్యర్థులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి షాడో రిజిస్టర్లు నిర్వహించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ అధికారి మురళీధర్‌రావు, సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ అధికారులు పాల్గొన్నారు.



సినీ నటి అనన్య నాగళ్ల శనివారం నగరంలో సందడి చేశారు. ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. హిట్ పాటలకు స్టెప్పులేసి అలంరించారు. సత్తుపల్లికి చెందిన అనన్య తెలుగు సినీరంగంలో వర్ధమాన తారగా ఎదుగుతున్నారు. వకీల్‌సాబ్, తంత్ర సినిమాల ద్వారా ఫేమ్ అయ్యారు.

-ఖమ్మం ఖానాపురం హవేలి

కామ్రేడ్ల స్నేహ 'హస్తం'

కమ్యూనిస్టుల ఖిల్లాగా పేరొందిన ఉమ్మడి ఖమ్మంలో ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికలకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు దూరంగా ఉంటున్నాయి. జాతీయస్థాయి అవగాహన మేరకు రాష్ట్రంలోనూ వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని 'ఇండియా' కూటమికే జై కొడుతున్నాయి. గతంలో ఖమ్మం, భద్రాచలం ఎంపీలను సైతం గెలుచుకున్న చరిత్ర సీపీఎం, సీపీఐలకు ఉంది. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల గెలుపులోనూ ఆ పార్టీల మద్దతు కీలకంగా ఉంది. అయితే కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న ఉమ్మడి ఖమ్మంలో టీడీపీ ఆవిర్భావంతో వారి ప్రాభవానికి బీటలు వారాయి. ఆ తర్వాత ఆ పార్టీలు టీడీపీతో జతకట్టి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందాయి. ఆ తర్వాత కాంగ్రెస్‌తో కలిసి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాయి. ఖమ్మం, భద్రాచలం లోక్‌సభ స్థానాల్లో ఈ రెండు పార్టీలది ముఖ్య భూమికగా సాగింది. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ ఒంటరిగా ప్రయాణించిన సీపీఎం, సీపీఐలు ఈసారి 'ఇండియా' కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు జై కొట్టబోతున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో పోటీకి సీపీఎం, సీపీఐ దూరం
- కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు
- త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో రెండు పార్టీలకూ గణనీయమైన ఓటు బ్యాంకు
- మిత్రపక్షాల మద్దతులో గతంలో పలుమార్లు గెలుపు



ఖమ్మం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీపీఎం నేతలతో చర్చలు జరపగా ఆ పార్టీ నుంచి సానుకూల స్పందన లభించింది. రేపోమాపో సీపీఎం అధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించబోతోంది. రాష్ట్రంలో గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగా పోటీచేసి దారుణంగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వబోతోంది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి వామపక్షల అభ్యర్థిగా సీపీఎం నుంచి బోడా వెంకట్ పోటీచేయగా ఆయనకు 57,102 ఓట్లు వచ్చాయి. సీపీఐ విషయానికి వస్తే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి కొత్తగూడెంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీచేసి గెలిచారు. అయితే అసెంబ్లీ ఎన్నికలతోనే పొత్తు ముగిసిందని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా పొత్తులో భాగంగా తమకు ఖమ్మం సీటు కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం లోక్‌సభ స్థానాలను వదిలి పెట్టేది లేదని తేల్చి చెప్పింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లోనూ సీపీఐ, కాంగ్రెస్‌తో పొత్తు కొనసాగించబోతుంది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా కల్లూరి వెంకటేశ్వరరావు పోటీచేసి 47,719ఓట్లు సాధించారు. 2014లో సీపీఎం, వైసీపీకి మద్దతు ఇచ్చి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విజయానికి కృషిచేయగా సీపీఐ మాత్రం కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసింది. అప్పటి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.నారాయణ పోటీచేసి కాంగ్రెస్ మద్దతుతో 1,87,702ఓట్లు సాధించారు. ఇలా వామపక్షాలకు ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలలో తమ ఓటు బ్యాంకు కొనసాగిస్తూ వచ్చాయి. గతంలో టీడీపీతో పొత్తు ఉన్నప్పుడు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సీపీఎం మిత్రపక్షాల మద్దతుతో కాంగ్రెస్‌ను వరుసగా ఢీకొట్టింది. 1996లో తమ్మినేని వీరభద్రం సీపీఎం నుంచి ఎంపీగా గెలుపొందారు. 1998లో నాదెండ్ల భాస్కరరావు చేతిలో తమ్మినేని ఓడిపోయారు. 2004లో కాంగ్రెస్ పొత్తుతో సీపీఎం అభ్యర్థి డాక్టర్ మిడియం బాబురావు భద్రాచలం ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గంలో టీడీపీ మద్దతుతో సీపీఐ అభ్యర్థి సోడే రామయ్య 1984, 1996, 1998లో మూడుసార్లు ఎంపీగా గెలిచారు. 1984లో గెలుపొందినప్పుడు ఆయన నేషనల్ ఫ్రంట్ నిర్ణయం మేరకు గడువుకు ముందే ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత 1996, 1998లో కూడా గెలుపొందిన సోడే రామయ్య పూర్తి కాలం పని చేయలేదు. అప్పటి మిశ్రమ ప్రభుత్వాలు పడిపోవడంతో మధ్యంతర ఎన్నికలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 1999లో టీడీపీతో వామపక్షాల పొత్తు విడిపోయింది. దీంతో సీపీఐ మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో గెలవలేకపోయింది. ఇలా వామపక్షాలు ఖమ్మం, భద్రాచలం నియోజకవర్గాల్లో పలుసార్లు ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. అటువంటి చరిత్ర కలిగిన రెండు కమ్యూనిస్టు పార్టీలకు కాలక్రమంలో ఓటు బ్యాంకు దెబ్బతినడంతో తాజాగా జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి నెలకొంది.



జిల్లా ప్రధాన న్యాయాధికారిగా రాజగోపాల్

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 20: ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారిగా టి.రాజగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాజగోపాల్ సూర్యాపేట జిల్లా న్యాయాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఖమ్మం వస్తున్నారు. ఇప్పటివరకు పనిచేస్తున్న బీఎస్ జగదీష్‌కుమార్ కోపరేటివ్ ట్రిబ్యునల్ హైదరాబాద్‌కు బదిలీపై వెళుతున్నారు. ఇక సత్తుపల్లి 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టనున్నారు.

అధికారం పోయినందుకు బాధ లేదు

- ప్రజల ఇబ్బందులనే చూడలేక పోతున్నాం
- నాలుగు నెలల్లోనే తెలంగాణ పరిస్థితి దారుణం
- కొణిజర్ల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ



కొణిజర్లలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

కొణిజర్ల/ఏన్కూరు, ఏప్రిల్ 20: రాష్ట్రంలో అధికారం పోయినందుకు తమకు బాధలేదని, ప్రజల ఇబ్బందులను చూసి జీర్ణించుకోలేకపోతున్నామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ మార్ పేర్కొన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ఇచ్చిన 24 గంటల కరెంట్ ఇప్పుడు ఎటు పోయిందని ప్రశ్నించారు. కొణిజర్ల మండలం శాంతినగర్ సమీపంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోతు మదన్‌లాల్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కొణిజర్ల మండల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు పోయాయని, కాంగ్రెస్ చేసిన వాగ్దానాలు పోయాయని చెబుతూ కార్యకర్తలతో సంక్షేమ పథకాలపై 'గోవింద నామస్మరణ' చేసి సమావేశంలో నవ్వులు కురిపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 420 వాగ్దానాలు చేసిందని, చివరికి అవి 420గానే మిగిలిపోయాయని విమర్శించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రాష్ట్ర సమస్యలపై పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలని కోరారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావును అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ 24న తాను నామినేషన్ వేస్తానని, ప్రజలు తనను గెలిపిస్తే రుణం తీర్చుకుంటానని తెలిపారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తానని తెలిపారు. ఆనాడు ఎంపీగా పార్లమెంట్‌లో ప్రజల సమస్యలపై పోరాడింది బీఆర్ఎస్ ఎంపీలేనన్నారు.

కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మదన్‌లాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిరంజీవి, పాముల వెంకటేశ్వర్లు, కిలారు కిరణ్, చెరుకుమల్లి రవి, బ్రహ్మం, మోహన్‌రావు, రామారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మట్టి కరిపించాలి

అలవికాని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో మట్టికరిపించాలని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏన్కూరులో శనివారం నిర్వహించిన ఏన్కూరు, జూలూరుపాడు మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో నామా మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పేందుకు లోక్‌సభ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందన్నారు. బూత్‌స్థాయిలో కష్టపడి పని చేస్తే విజయం తమదేనని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చి గోవిందా..

పువ్వాడ వెరైటీ పాట

కొణిజర్ల, ఏప్రిల్ 20: ఖమ్మం జిల్లా కొణిజర్లలో శనివారం రాత్రి బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ భిన్నమైన ప్రసంగం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ గోవిందనామ స్మరణకు పేరడీగా గీతం వినిపించారు. తాను పాడుతూ కార్యకర్తలచే పాడించారు. పేరడీ పాట ఇలా సాగింది...

గోవిందా హరి గోవిందా..
కాంగ్రెస్ వచ్చి గోవిందా..
రైతుబంధు గోవిందా..
కళ్యాణలక్ష్మి గోవిందా..
తులం బంగారం గోవిందా..
15వేల రైతుభరోసా గోవిందా..
2500 మహాలక్ష్మి గోవిందా..
కాంగ్రెస్ వచ్చి గోవిందా..
గోవింద హరి గోవిందా..
కరెంట్ పని గోవిందా..
మిషన్ భగీరథ గోవిందా..
చెరువులు ఎండిపోయే గోవిందా!

నామా ప్రచార సందడి



ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 20: ఎన్నికల ప్రచారంలో భాగంగా నామా నాగేశ్వరరావు శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియం, ఎస్ఆర్అండ్‌బీజీఎన్నార్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా సర్దార్‌పటేల్ స్టేడియంలో నామా జిమ్ చేసి, వాకర్స్‌తో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. నామా వెంట కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, నాయకులు మోతారపు సుధాకర్, వాకర్స్‌క్లబ్ సభ్యులు నెల్లూరి చంద్రయ్య, గొడ్డేటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాల మోదీ

మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ మూలసూత్రాలకే ప్రమాదం

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి
- సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 20: మూడోసారి మోదీ నినాదంతో బీజేపీ దేశవ్యాప్తంగా ముందుకు వెళ్తోందని, కానీ మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగ మూల సూత్రాలకే ప్రమాదం వస్తుందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గం, ముఖ్య నాయకుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలు ప్రజాపంథా వైఖరిపై చర్చించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గత పదేళ్ల బీజేపీ పరిపాలనలో కార్పొరేట్ శక్తులను అభివృద్ధి చేసేందుకు మోదీ బాటలు వేశారని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను కలిగిన భారతదేశంలో ఫాసిస్ట్ విధానాలను పెంచి పోషించారని ఆరోపించారు. ప్రతిపక్షమే లేని బీజేపీ అధికారం కోసం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓడిపోతామని తెలిసినా కూడా విప్లవ పార్టీలు పోటీ చేసి తమ బలాన్ని నిరూపణ చేసుకొని భవిష్యత్ ఉద్యమ బాటలు వేస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలోనూ ఖమ్మంలోనే బీజాలు వేసి రాష్ట్రాన్ని సాధించామని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చంద్ర అరుణ, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ పదేళ్లుగా అటవీ ప్రాంతంలో గిరిజనుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులు ప్రవేశించి గిరిజన సంపద కొల్లగొట్టాయని ఆరోపించారు. అందుకే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ బీజేపీకి వ్యతిరేకంగా నిలబడే పార్టీలకు ఓటు వేయాలని నిర్ణయించటం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా నాయకులు బుర్ర అచ్చయ్య, బందెల వెంకయ్య, ముద్దా బిక్షం, కెచ్చల కల్పన, కల్లూరి కిషోర్, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, శాంతయ్య, అజయ్, ఆర్ బోసు, కంగాల కల్లయ్య, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, జీ రామయ్య, కే అర్జున్‌రావు, శిరోమణి, మంగతాయి, ఝాన్సీ, పీ శోభ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు రంగారావు

పలు రైళ్ల రద్దు.. కొన్ని మళ్లింపు

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 20: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో కాజీపేట, విజయవాడ మార్గంలో బోనకల్, చింతకాని, పందిళ్లపల్లి, ఎర్రుపాలెం, తొండలగోపవరం, మధిర సమీపంలో 3వ లైన్ విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మొత్తం నాలుగు బ్లాకుల్లో 33.39 కిలోమీటర్ల మేర రైల్వే మూడో లైన్ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, ఈ నేపథ్యంలో కాజీపేట- విజయవాడ మార్గ మధ్యలో నడిచే కొన్ని రైళ్లను ఈనెల 22 నుంచి 26 వరకు నాలుగు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దుచేసి దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. 10 రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. వీటిలో భద్రాచలం రోడ్ విజయవాడ మార్గంలో నడిచే పాసింజర్, కాజీపేట డోర్నకల్, విజయవాడ డోర్నకల్ మార్గంలో నడుస్తున్న 10 పాసింజర్ రైళ్లను రద్దుచేశారు. తిరుపతి-ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు మీదుగా దారి మళ్లించారు. తాత్కాలికంగా మరో నాలుగు రైళ్లను రద్దుచేశారు.

మూడో రోజు రెండు నామినేషన్లు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో మూడో రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం స్వతంత్ర్య అభ్యర్థిగా షేక్ బాజీ బాబా ఒక సెట్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు అందజేశారు. తొలిరోజున నామినేషన్ వేసిన ఆధార్‌పార్టీ నుంచి కుక్కల నాగయ్య శనివారం రెండో నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. దీంతో మొత్తంగా నాలుగు నామినేషన్లు అందించినట్లు ఖమ్మం రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. ముగ్గురు వ్యక్తులు నాలుగు నామినేషన్లు అందినట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

కాంగ్రెస్‌వి నిరాధార ఆరోపణలు

- మంత్రి తుమ్మలపై దాడి చేయించే అవసరం పువ్వాడకు లేదు
- సమగ్ర విచారణ జరిపిస్తే నిజాలు వెల్లడవుతాయి
- బీఆర్ఎస్ నేతలు నీరజ, నాగరాజు

6


ఉద్యోగాల పేరుతో టోకరా..

- ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి డబ్బుల వసూలు
- పలు జిల్లాల్లో 50 మంది వరకు బాధితులు
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

6

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటు ఖమ్మం, అటు భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థులు పలువురు కేంద్ర మంత్రులు జాతీయ రాజకీయాల్లో రాణించారు. కేంద్రంలో చక్రం తిప్పి తమ వంతు పాత్ర పోషించారు. ఎంపీలుగా జాతీయ రాజకీయాల్లోను తమ వంతు ముద్ర చూపించి ఉమ్మడి జిల్లా ప్రతిష్టను జాతీయ రాజకీయాల్లోను చూపించారు. ఖమ్మం నుంచి గెలుపొందిన వారితో పాటు భద్రాచలం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలనుంచి గెలుపొందిన వారు కూడా కేంద్ర మంత్రులయ్యారు. వారు రాజీవ్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ కేబినేట్‌లో కేంద్రమంత్రులుగా తమ వంతు పాత్ర పోషించారు.





జలగం వెంగళరావు



రంగయ్య నాయుడు



పోరిక బలరాంనాయక్

హస్తినలో ఐదుగురు

- కేంద్ర కేబినెట్‌లో ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్ ఎంపీలు
- ఉమ్మడి జిల్లా నుంచి చక్రం తిప్పిన కేంద్ర మంత్రులు

ఖమ్మం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి చూస్తే 1984, 1989లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన జలగం వెంగళరావు రాజీవ్‌గాంధీ కేబినేట్‌లో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా వ్యవహరించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయాలు నిర్వహించిన వెంగళరావు ఖమ్మం ఎంపీగా కూడా పనిచేశారు. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఆనాడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు.

1991లో ఖమ్మం నుంచి లోక్‌సభకు ఎన్నికైన పీవీ రంగయ్య నాయుడు కూడా ప్రధాని పీవీ ప్రభుత్వంలో కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిగా పనిచేశారు. జిల్లాలో టెలికం రంగ అభివృద్ధికి పాటుపడ్డారు. 1999, 2004లో ఖమ్మం లోక్‌సభ నుంచి గెలుపొందిన రేణుకాచౌదరి 2004లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా, స్త్రీ కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా కేంద్రంలో పనిచేశారు. మహిళ హక్కులు, రక్షణ చట్టాల రూపకల్పన, ఐసీడీఎస్ ద్వారా పిల్లల సంక్షేమానికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా భద్రాచలంలో పున్నమి గెస్టహౌస్ నిర్మించారు. రేణుకాచౌదరి తెలుగు దేశం పార్టీ(టీడీపీ)లో ఉన్నప్పుడు కూడా అప్పటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో కూడా కేంద్రమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ముగ్గురు కేంద్రమంత్రులుగా ఎన్నిక కాగా భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా కేంద్ర మంత్రిగా పనిచేసిన వారున్నారు. అక్కడ కాంగ్రెస్ నుంచి 1989,1991లో ఎంపీగా గెలిచిన కర్రెద్దుల కమలకుమారి పీవీ నర్సింహారావు ప్రభుత్వంలో స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గం పునర్విభజనలో విడిపోయి మహబాద్ లోక్‌సభ నియోజకవర్గంగా 2009లో ఏర్పడింది. 2009లో మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందిన పోరిక బలరాంనాయక్ కూడా మన్మోహన్‌సింగ్ కేబినేట్‌లో కేంద్ర సామాజిక, సాధికారికశాఖ మంత్రిగా పనిచేశారు. ఇలా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీలు ఐదుగురు కేంద్రమంత్రులుగా ఉమ్మడి జిల్లానుంచి వ్యవహరించారు.



రేణుకా చౌదరి



కమలకుమారి

వైరా ఓటరు తీరే వేరు..

- 2009 నుంచి ఎంపీ ఎన్నికల్లో భిన్నమైన తీర్పులు
- రెండుసార్లు ప్రతిపక్షానికి, ఒక సారి అధికార పక్షానికి మెజారిటీ
- ఈ సారి ఎవరివైపు మొగ్గు చూపుతారో..



వైరా, ఏప్రిల్ 20: వైరా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన గత మూడు ఎంపీ ఎన్నికల్లో రెండుసార్లు ప్రతిపక్ష అభ్యర్థులకు, ఒకసారి అధికార పార్టీ అభ్యర్థికి ఓటర్లు మెజార్టీ కట్టబెట్టారు. ఆ ఎన్నికలు జరిగిన సమయంలో రెండుసార్లు అధికార పార్టీ అభ్యర్థులకు తక్కువ ఓట్లు రాగా.. ఒక ఎన్నికలో మాత్రం అధికార పార్టీ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు వచ్చాయి.

వైరా నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత తొలిసారి 2009లో ఎంపీ ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో రాష్ట్ర, కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పటికే రెండుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ఉండి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలను ఒంటిచేత్తో శాసిస్తున్న రేణుకాచౌదరి మూడోసారి ఖమ్మం ఎంపీ బరిలో నిలిచారు. అయితే ఆ ఎన్నికల్లో వైరా అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థి అయిన రేణుకకు తక్కువ ఓట్లు వచ్చాయి. రేణుకాచౌదరికి వైరా సెగ్మెంట్‌లో 40,608ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 58,835ఓట్లు రాగా, నాటి పీఆర్పీ అభ్యర్థి జలగం హేమమాలినికి 16,160ఓట్లు వచ్చాయి. రేణుక కంటే నామాకు వైరా నియోజకవర్గంలో 18,227ఓట్ల మెజార్టీ లభించింది.

2014లో కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసిన సీపీఐ అభ్యర్థి కంకణాల నారాయణకు కేవలం 27,171ఓట్లు మాత్రమే వచ్చాయి. అప్పటి ఎంపీగా ఉండి రెండోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన నామా నాగేశ్వరరావుకు 49,550ఓట్లు వచ్చాయి. సీపీఎం మద్దతుతో పోటీచేసిన వైసీపీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 58,628ఓట్లు లభించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి షేక్ బుడాన్‌బేగ్‌కు 5,641ఓట్లు మాత్రమే వచ్చాయి. పొంగులేటికి వైరా నియోజకవర్గ స్థాయిలో 9078ఓట్ల మెజార్టీ లభించింది.

మూడోసారి 2019లో జరిగిన ఖమ్మం ఎంపీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గ స్థాయిలో అధికార బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన నామా నాగేశ్వరరావుకు 65,819ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 58,139ఓట్లు లభించాయి. తొలిసారి అధికార పార్టీకి చెందిన నామాకు 7,680ఓట్ల మెజార్టీ లభించింది. అయితే వచ్చేనెల 13న నాల్గోసారి జరుగనున్న ఎంపీ ఎన్నికల్లో వైరా ఓటర్లు అధికార పార్టీకి మెజార్టీ కట్టబడెతారా..? లేక ప్రతిపక్ష అభ్యర్థులకు అనుకూలంగా ఉంటారా అనేది జూన్ 4వతేదీన తేలనుంది.



తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్వర్లు

కాంగ్రెస్‌లోకి 16వ డివిజన్ కార్పొరేటర్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 20: ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల సమక్షంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మేడారపు వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా మేడారపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ మార్పు వెనుక ఎవ్వరి వత్తిడి లేదని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.

పువ్వాడపై నిరాధార ఆరోపణలు

- మంత్రి తుమ్మలపై దాడిచేయించే అవసరం ఆయనకు లేదు
- సమగ్ర విచారణ జరిపిస్తే నిజాలు వెల్లడవుతాయి
- బీఆర్ఎస్ నేతలు నీరజ, నాగరాజు

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్ 20: అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై దాడి చేయించే అవసరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు లేదని, ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని నగర మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు షేక్ మక్బూల్, దండా జ్యోతిరెడ్డితో కలిసి శనివారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వాగ్దానాలు అమలు చేయలేదని ప్రజలు నిలదీస్తారనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ కార్పొరేటర్లు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. గత 5 దశాబ్దాలుగా పువ్వాడ కుటుంబంపై ఎటువంటి మచ్చ లేదన్నారు. ఖమ్మం జిల్లాలో హత్యారాజకీయాలు లేవని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆ సంస్కృతిని ప్రవేశపెట్టాలని చూస్తున్నారన్నారు. తుమ్మల పాలేరులో పోటీ చేసేందుకు ఆసక్తి చూపి, అధిష్ఠానం ఒత్తిడితో ఖమ్మంలో పోటీకి దిగారన్నారు. అటువంటి వ్యక్తిపై దాడికి కుట్ర చేసే అవసరం పువ్వాడకు లేదన్నారు. పువ్వాడపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేతల వద్ద ఆధారాలు ఉన్నాయా? అని మేయర్, బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేయకుండా పువ్వాడపై ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చింది మంచిపాలన అందించటానికి కాని, ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయటానికి కాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మంచిపేరు తెచ్చుకోవాలి తప్ప ఇలా దిగుజారుడు వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. విలేకరులు సమావేశంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, బీఆర్ఎస్ లీగల్‌సెల్ నాయకులు మేకల సుగుణారావు పాల్గొన్నారు.



పోలింగ్‌బూత్ ఏర్పాట్లను పరిశీలస్తున్న ఎస్ఈ చంద్రమౌళి

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

కారేపల్లి, ఏప్రిల్20: మండల పరిధిలోని గాంధీనగరం, విశ్వనాధపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లకు సంబంధించిన పనులను జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రమౌళి పరిశీలించారు. పురుషులకు, మహిళ ఓటర్లకు వేరువేరుగా మూత్రశాలలు, విద్యుత్, తాగునీరువంటి వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక సిబ్బందిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా డీఈ కరుణకర్, ఏఈ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభం



పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న నామా, వద్దిరాజు, తాతా మధుసూదన్

ఖమ్మంకార్పొరేషన్, ఏప్రిల్20: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు శనివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి, డిమాండ్లు రాసిన పోస్టుకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని, అలాగే రైతుబంధు రూ.15వేలకు పెంచుతామని, పింఛన్ రూ.4వేలు ఇస్తామని, వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారని, ఆ వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేసీఆర్ పిలుపు మేరకు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టామన్నారు. తమ డిమాండ్లు రాసిన పోస్టుకార్డులను ప్రభుత్వానికి పంపుతామని నామా, పువ్వాడ, వద్దిరాజు, తాతా మధుసూదన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ స్ట్రాంగ్ రూములకు

ఈవీఎం యంత్రాల తరలింపు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల



స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల

కొత్తగూడెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఆర్డీవో కార్యాలయంలో గల ఈవీఎం గోదామును పరిశీలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఉన్న ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల రూములకు మొదటి ఈవీఎం ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నామని, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 316 బ్యాలెట్ యూనిట్లు, 316 కంట్రోల్ యూనిట్లు, 354 వీవీ ప్యాట్లు రామచంద్ర డిగ్రీ కాలేజీ స్ట్రాంగ్ రూములో భద్రపర్చడం జరుగుతుందని తెలిపారు. భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 225 బ్యాలెట్ యూనిట్లు, 225 కంట్రోల్ యూనిట్లు, 252 వీవీప్యాట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 230 బ్యాలెట్ యూనిట్లు, 230 కంట్రోల్ యూనిట్లు, 257 వీవీ ప్యాట్లు అశ్వారావుపేటలోని అగ్రికల్చరల్ యూనివర్శిటి కాలేజీలో భద్రపర్చడం జరుగుతుందని వివరించారు. ఇల్లెందు అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 302 బ్యాలెట్ యూనిట్లు, 302 కంట్రోల్ యూనిట్లు, 338 వీవీప్యాడ్లు ఇల్లెందు సింగరేణి బాలికల పాఠశాలలో భద్రపర్చామన్నారు. పినపాక అసెంబ్లీ సెగ్మెంటుకు కేటాయించిన 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 350 వీవీ ప్యాడ్లు మణుగూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భద్రపర్చినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు ఎన్నికల విభాగం తహసిల్దార్ దార ప్రసాద్, కొత్తగూడెం తహశిల్దార్ పుల్లయ్య, టీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, టీఎస్పీ జిల్లా అధ్యక్షులు గంధం మల్లిఖార్జునరావు, సీపీఐ జిల్లా కార్యవర్గసమితి సభ్యులు, కౌన్సిలర్ కంచర్ల జమలయ్య, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

తాండ్ర వినోద్‌రావు గెలుపునకు

మహిళలు కృషిచేయాలి

- ప్రధాని మోదీ వల్లనే దేశవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు
- బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి



మాట్లాడుతున్న శిల్పారెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్20: బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపుకు మహిళలంతా కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. నగరంలోని శ్రీశ్రీసర్కిల్‌లోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం రాత్రి మహిళ శక్తి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వినోదరావు ప్రజలకు సేవ చేసేందుకు వచ్చారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. దేశవ్యాప్తంగా మోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రతి ఒక్కరు చూసి మోదీని మళ్లీ గెలిపించేదుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లిశ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కొత్తగూడెంజిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఆయన సతీమణి వినీల, సమ్మేళనం ఇన్‌చార్జ్ గీతారెడ్డి, విజయారెడ్డి, సరస్వతి, పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఖమ్మంఊరల్ మండలం కాచిరాజుగూడేనికి చెందిన సీపీఎం ముఖ్యనాయకులు శనివారం బీజేపీలో చేరారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవి ఆధ్వర్యంలో నగరంలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో తాండ్ర వినోదరావు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మోదీ చేస్తున్నఅభివృద్ధికి పేద బడుగు, బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై భారీగా పార్టీలో చేరుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో భాన్యానాయక్, గజ్జల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సండ్ర కారును తనిఖీ చేస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యే సండ్ర కారు తనిఖీ

కల్లూరు, ఏప్రిల్ 20: కల్లూరులో శనివారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కారును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. కల్లూరు పెట్రోల్ బ్యాంకు వద్ద రాష్ట్రీయ ప్రధాన రహదారిపై పార్లమెంట్ ఎన్నిలను దృష్టిలో ఉంచుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటకవీరయ్య కారు కల్లూరు వైపు నుంచి ఖమ్మం వెళుతుండగా సదరు కారును స్క్వాడ్ అధికారి వి. ప్రభాకర్ తన సిబ్బందితో ఆపి తనిఖీ చేశారు. కారు తనిఖీలో సండ్ర ఓపికతో అధికారులకు సహకరించారు ఈ తనిఖీలో కానిస్టేబుల్స్, సిబ్బందిలు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా..

- ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి డబ్బుల వసూలు
- పలు జిల్లాల్లో 50 మంది వరకు బాధితులు
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 20: 'బ్యాక్‌డోర్' ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఖమ్మం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లాకు చెందిన పారేపల్లి సాయికృష్ణ, అతడి స్నేహితుడు రావులపాటి శివ హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో నివాసం ఉండే వారు. వీరు పలు ఇంజనీరింగ్ కాలేజీల హెచ్‌వోడీల ఫోన్‌నెంబర్లను వెబ్‌సైట్ల ద్వారా సేకరించి పాత విద్యార్థిగా పరిచయం చేసుకుని బ్యాక్‌డోర్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించేవారు. వారిని నమ్మిన హెచ్‌వోడీలు 'ప్లేస్‌మెంట్ కావాలంటే ఫలానా నెంబర్‌కు ఫోన్ చేయండి' అంటూ సాయికృష్ణ, శివ నెంబర్లను కాలేజీ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో విద్యార్థులు వారికి ఫోన్ చేసి మాట్లాడగా ముందుగా రూ.35వేలు చెల్లించాలని, కంపెనీ జీతం వచ్చిన తర్వాత మరో రూ.30వేలు చెల్లించాలని ఖమ్మానికి చెందిన ఇద్దరు యువతుల నుంచి యూపీఐ ద్వారా నగదు తీసుకుని ముఖం చాటేశారు. దీంతో బాధితులు గతనెల 27న సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారణ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి బారిన పడి ఖమ్మంతోపాటు నల్లగొండ హైదరాబాద్, జగిత్యాల, గుంటూరు, రాజమండ్రి జిల్లాల్లో సుమారు 50 మంది మోసపోయినట్టు సీపీ తెలిపారు. ఐపీఎల్ బెట్టింగ్‌లు, జల్సాలకు అలవాటు పడిన వీరిని ఖమ్మం కొత్తబస్టాండ్‌లో శుక్రవారం అదుపులోకి తీసుకున్నామని, శనివారం వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీపీ ఈ ప్రకటనలో తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.లక్ష 15వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసును సమర్థవంతంగా ఛేదించిన సైబర్‌క్రైం ఏసీపీ ఫణీంద్ర, సీఐ శివకుమార్, ఎస్ఐలు రంజిత్, విజయ్‌కుమార్‌ను సీపీ అభినందించారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి రాజీనామా



సురేష్‌నాయక్

ఏన్కూరు, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ ఏన్కూరు మండల అధ్యక్షుడు బానోతు సురేష్‌నాయక్ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. గత ఐదేళ్లగా తనకు సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

పాల్వంచ, ఏప్రిల్ 20: బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. పాల్వంచ మండల రాజాపురం గ్రామంలోని సత్యనారాయణ కిరాణం (బెల్టు)షాపులో అక్రమంగా మద్యం సీసాలు నిల్వ ఉంచారనే సమాచారం అందుకున్న ఎన్నికల స్క్వాడ్ అధికారులు షాపులో తనిఖీలు చేపట్టారు. రూ.16 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పాల్వంచ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. షాపు యజమాని సత్యనారాయణపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు.

ప్రతీ పైసకు లెక్క చూపాలి



ఎన్నికల పరిశీలకుడితో సమావేశమైన కలెక్టర్

కొత్తగూడెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్ చేసిన నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు ప్రతి రూపాయి ఖర్చును వ్యయ పరిశీలకుల బృందాలు నమోదుచేయాలని వ్యయ పరిశీలకులు శంకర్ నందా మిశ్రా తెలిపారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అలాతో సమావేశం నిర్వహించారు. అన్ని బృందాలు సమన్వయంతో పని చేయాలన్నారు. డబ్బు, మద్యం ప్రలోభాలకు లొంగకుండా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. బ్యాంకు ఖాతాలను, డిజిటల్ లావాదేవీలను తనిఖీ చేయాలన్నారు. ర్యాలీలు, సమావేశాలు జరిగినప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయించిన ధర ప్రకారం ఖర్చు నమోదు చేయాలని సూచించారు.

గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

● జడ్పీ సీఈవో వినోద్

ముదిగొండ/నేలకొండపల్లి, ఏప్రిల్ 20: తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని జడ్పీ సీఈవో వినోద్ సూచించారు. శనివారం ఆయా మండల కేంద్రాల్లో పర్యటించారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ బోర్లలో నీరు లేకపోతే సమీప వ్యవసాయ బోర్లలో నీరు ఉంటే వాటి నుంచి నీటిని తీసుకుని ప్రజలకు సరఫరా చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ఈజీఎస్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవోలు శ్రీధర్‌స్వామి, ఎర్రయ్య, ఎంపీవోలు సూర్యనారాయణ, శివ, సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో వినోద్

రైతన్నా..జర జాగ్రత్త!

» రసాయన మందుల పిచికారీలో అప్రమత్తం అవసరం

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 20: వాణిజ్య పంటలతోపాటు ఇతర పంటలపై ఈ మధ్యకాలంలో రసాయన మందుల వాడకం పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందులను ఆశ్రయిస్తున్నారు. పంట కాలంలో ఆరు నుంచి పదిసార్లు రసాయన మందులను పిచికారీ చేయడం ఆందోళనకరం. వాడే పద్ధతి తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. రసాయన మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆధునిక వ్యవసాయ విధానంలో దిగుబడులను పెంచుకునేందుకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగిపోయింది. ఎరువులు, క్రిమిసంహారక మందులు స్ప్రే చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మోనోక్రోటోఫాస్, ఆక్సిడి మెటాన్, మిథైల్, ఆసిఫేట్ తదితర విషపూరితమైన మందులు పిచికారీ చేసే సమయంలో వాటి వినియోగ విధానంపై అవగాహన ఉండాలని సూచిస్తున్నారు.

పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందుల పిచికారీకి ముందు వ్యక్తి తప్పనిసరిగా ముక్కు, కండ్లకు మందు తాకకుండా హెల్మెట్ లాంటిది తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకొనే సమయంలో చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్లు తాగడం, బీడీ, సిగరెట్ పీల్చడం లాంటి పనులు చేయరాదు.
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసిన తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు. సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన అవసరం.
- వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహా, సూచనలు పాటిస్తూ మందులను కొనుగోలు చేయాలి.



నిర్లక్ష్యం వహించవద్దు

పంటలను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమిసంహారక మందుల స్ప్రే తప్పనిసరైందే. కానీ, వాటిని వినియోగించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వాటి ప్రభావం ఆరోగ్యంపై పడుతుంది. పిచికారీ సమయంలో రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్తుంది. ప్రాథమిక చికిత్సకు అవకాశాలు తక్కువే ఉంటాయి. అత్యవసర చికిత్సయే శరణ్యం. రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి మందులను పిచికారీ చేయడం శ్రేయస్కరం. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కోసారి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే ఆస్కారం ఉన్నది చూసుకోవాలి.

'చట్టాలపై అవగాహన అవసరం'



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జావీద్‌పాషా

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 20: చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. శనివారం న్యాయసేవాధికారసంస్థ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికారసంస్థ అందిస్తున్న సేవలగురించి వివరించారు. న్యాయస్థానాలలో దాఖలయ్యే సివిల్, క్రిమినల్ కేసుల గురించి పారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. న్యాయం అందరికీ సమానంగా అందుతున్న విషయాన్ని ప్రతీ ఒక్కరికి అర్థమయ్యేవిధంగా అవగాహన కల్పించే బాధ్యత పారా లీగల్ వాలింటీర్లపై ఉందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం, అట్టడుగు వర్గాల వారికి, సంవత్సర ఆదాయం రూ.3లక్షలు గల వారికి, మహిళలకు, మానసిక దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచితంగా ప్రభుత్వం న్యాయవాదిని నియమిస్తామన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేవిధంగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తామని వివరాంచారు. ఈ సమావేశంలో పారా లీగల్ వాలంటీర్లు నాగమణి, సుశీల, మమత, సునీత, మానస, శంకర్‌రావు, బిస్మిల్లా, కృష్ణ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



విజయ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ లింగాల, కొండబాల

బోనకల్, ఏప్రిల్ 20: కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ బందం శ్రీనివాసరావు భార్య విజయ(50) ఇటీవల వారి కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో కొన్ని రోజులుగా ఆమె మనస్తాపంగా ఉంటోంది. శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు. మృతదేహాన్ని జడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, కొండబాల కోటేశ్వరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మధిరటౌన్, ఏప్రిల్20: మధిరలోని వైరా నది నుంచి అ క్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ సంధ్య శనివారం పట్టుకున్నారు. మధిర నుంచి అంబారుపేటకు రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మధిరలోని ట్యాంక్‌బండ్ వద్ద తనిఖీలు చేస్తుండగా, ఇసుకకు సంబంధించిన ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్నేహితుడి పుట్టిన రోజున విషాదం

●క్వారీలో పడి ఇంటర్ విద్యార్థి మృతి



అభినవ్

కీసర, ఏప్రిల్ 20: స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వచ్చిన ఓ విద్యార్థి క్వారీలో పడి మృత్యువాత పడిన ఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి హరికృష్ణ, విజయలక్ష్మి దంపతులు ఇసీఐఎల్ కమలానగర్‌లో స్థిరపడ్డారు. వీరి కూతురు ఉన్నత చదువుల నిమిత్తం ఆమెరికాలో ఉండగా కుమారుడు అభినవ్(18) ఇసీఐఎల్‌లో శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఇదిలా ఉండగా శుక్రవారం అభినవ్ స్నేహితుడు నిరంజన్ పుట్టిన రోజు ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఆకాష్, నిరంజన్, చరణ్ అభినవ్‌లు నలుగురు కలిసి ఓలా క్యాబ్‌లో కీసర మండల పరిధి యాద్గార్‌పల్లిలోని అండర్ ది మూన్ రిసార్ట్‌కు వచ్చారు. పుట్టినరోజు సందర్భంగా నలుగురు స్నేహితులు కలిసి సంతోషంతో సరదాగా ఫొటోలు, సెల్ఫీలు దిగి, భోజనాలు చేశారు. సాయంత్రం రిసార్ట్ పక్కన యాద్గార్‌పల్లి-అంకిరెడ్డిపల్లి మధ్యన ఉన్న క్వారీని చూసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో హఠాత్తుగా అభినవ్ క్వారీలో మధ్యలోకి వెళ్లి నీటమునిగాడు. గమనించిన స్నేహితులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. ఈ మేరకు స్నేహితులు స్థానికులకు, కుటుంబసభ్యులకు సమాచార ఇవ్వగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. కాగా అభినవ్‌ను వెతికే ప్రయత్నం చేయగా, చీకటి పడింది. దీంతో పోలీసులు శనివారం గజఈతగాళ్ల సాయంతో అభినవ్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

అనునిత్యం కేసుల తీర్పులను అధ్యయనం చేయాలి

» సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లి, ఏప్రిల్20: నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన జూనియర్ న్యాయవాదులు అనునిత్యం కేసుల తీర్పులను అధ్యయనం చేయాలని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి అన్నారు. శనివారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన ఐఏఎల్ స్టడీ సర్కిల్‌లో ఆమె పాల్గొని ప్రసంగించారు. గౌరవప్రదమైన న్యాయవాద వృత్తిని ఎంచుకోవడం సంతోషించదగ్గ విషయమని ప్రశంసించారు. ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడటానికి న్యాయవాద వృత్తి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. నూతనంగా వచ్చిన చట్టాలను అధ్యయనం చేయాల్సిన అవసరం జూనియర్ న్యాయవాదుల మీద ఉందని, వాస్తవానికి 152ఏళ్ల క్రితం రాసిన ఐపీసీని మార్చడంలో తప్పేమీ లేదని తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యులు దుస్సా జనార్ధన్ అన్నారు. ఖమ్మం జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ మామిడి హనుమంతరావు మాట్లాడుతూ ఐపీసీలో బ్రిటీష్ కాలం నాటి 22 సెక్షన్లను తొలగించారని, సీఆర్పీసీలో 17సెక్షన్లను తొలగించడంతో పాటు 6సెక్షన్లను కలిపారని, నూతనంగా ప్రవేశపెట్టిన న్యాయ సంహిత చట్టాలలో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ గురించి ప్రముఖంగా ప్రస్తావించారన్నారు. వాస్తవానికి సత్వర న్యాయం పేరుతో ఈ చట్టాలు తెచ్చినప్పటికీ ప్రస్తుతం ఉన్న కోర్టుల సంఖ్య, జడ్జీలు, ఇతర యంత్రాగం సరిపడా లేని సమస్యతో మళ్లీ కథ మొదటికే వస్తుందన్నారు. వరంగల్ ఆదర్శలా కళాశాల అధ్యాపకులు పీ.తేజారెడ్డి మాట్లాడుతూ కుటుంబ చట్టాల గురించి ఉపన్యసిస్తూ మన పురాణాల నుంచి కుటుంబ చట్టాలు ఏర్పాడాయని, ఏ మతానికి ఆ మతం చట్టాల రూపంలో తమ యొక్క పురాణాలను, సంస్కృతి, సంప్రదాయలను ఫ్యామిలీ లాలో ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఉపాధ్యాక్షులు కే.ఉమామహేశ్వరరావు, టీ.అరుణ, కోశాధికారి శరత్ బాబు, సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి అరుణకుమారి

అగ్ని ప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధం

బోనకల్, ఏప్రిల్ 20: ప్రమాదవశాత్తూ మామిడి చెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని చిరునోముల రెవెన్యూ పరిధిలో శనివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నీలం రఘు తన మామిడి తోటను గోళ్ల పరుశురానికి కౌలుకు ఇచ్చాడు. మామిడి తోట పక్కనే ఉన్న బోనకల్‌కు చెందిన రైతు తన పొలంలో మొక్కజొన్న దంటుకు నిప్పంటించాడు. చెత్త కాల్చే ఉద్దేశ్యంతో పెట్టిన నిప్పు గాలికి పక్కనే ఉన్న మామిడి తోటకు అంటుకోవడంతో కాపుతో ఉన్న మామిడి చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని బాధిత రైతు వాపోయాడు. అగ్ని ప్రమాదం వలన తనకు దాదాపు రూ.60 వేల పంట నష్టంతో పాటు పది చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపాడు.



ప్రమాదంలో దగ్ధమైన మామిడి చెట్లు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజేష్(ఫైల్)

తల్లాడ, ఏప్రిల్ 20: మినీ వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన సంఘటన అన్నారుగూడెం కాటన్ పార్కు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అన్నారుగూడెం గ్రామానికి చెందిన యువకుడు వేముల రాజేష్(19), అదే గ్రామానికి చెందిన వేముల రాము, కొమ్మినేని సాయితో కలిసి స్వగ్రామం నుంచి మినీ వ్యాన్‌లో భద్రాచలం పరిసర ప్రాంతాల్లో మిర్చి కొనుగోలు చేసేందుకు వెళ్లారు. కొనుగోలు చేసిన మిర్చిని మినీ వ్యాన్‌లో లోడ్ చేసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కాటన్‌పార్కు సమీపంలో అదుపుతప్పి మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజేష్ తీవ్రంగా గాయపడగా, 108వాహనంలో చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ: ఐదుగురికి గాయాలు

కారేపల్లి ఏప్రిల్20: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్ర మాదంలో ఐదుగురు విద్యార్థులకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని కారేపల్లి గ్రామాల సమీపంలోని ఓసీ వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన పలువురు విద్యార్థులు ఇల్లెందులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు ఆటోలో వెళ్తుంటారు. శనివారం రోజు మాదిరిగా ఆటోలో వెళ్తుండగా, ఇల్లెందు-కారేపల్లి గ్రామాల సమీపంలోని ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఐదుగురు విద్యార్థులతో పాటు, ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో జైలు అధికారి..



ఫకీర్ అహ్మద్(ఫైల్)

తల్లాడ, ఏప్రిల్ 20: తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన జిల్లా జైలులో హెడ్‌వార్డర్‌గా పనిచేస్తున్న షేక్.ఫకీర్ అహ్మద్(58)శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఫకీర్ అహ్మద్ మృతిదేహాన్ని జైళ్లశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, జైలర్ జి.లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్ కె.హన్మంతరావు సందర్శించి నివాళులర్పించారు. జైళ్లశాఖ తరపున అంత్యక్రియలకు రూ.20వేలు, కుటుంబఖర్చుల కోసం మరో రూ.30 వేల చొప్పున ఆర్థికసహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. అహ్మద్‌కు భార్య, ముగ్గురు కుమారులున్నారు.

ప్రమాదవశాత్తూ వాగులో పడి వ్యక్తి..



కొట్టె శ్రీను

ములకలపల్లి, ఏప్రిల్ 20: ప్రమాదవశాత్తూ వాగులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రింగిరెడ్డిపల్లి వద్ద శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ములకలపల్లి గ్రామానికి చెందిన కొట్టె శ్రీను(40)గేదెలు మేపే పనిలో భాగంగా అటుగా వెళ్లాడు. ములకలపల్లి మండల కేంద్రం నుంచి రింగిరెడ్డిపల్లికి వెళ్లేమార్గంలో నూతనంగా వంతెన నిర్మాణం జరుగుతుంది. ఈ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పక్కనే గుంతను తీశారు. గుంతను గమనించిన అతడు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. మృతుడికి కుమార్తె ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజమౌళి ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై మృతుడి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 20: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం, ముల్కలపల్లి గ్రామానికి చెందిన తేజావత్ తరుణ్ (22) డిగ్రీ వరకు చదువుకుని ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు చదువుకోవాలని కోరినా వారి మాట వినకుండా మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఈనెల 15న పురుగుల మందు తాగి రూరల్ మండలం, వాల్యాతండా వద్ద పడిఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 20: జామాయిల్ తోటలోని కర్రలను యజమానికి తెలియకుండా నరికి వాటిని అముకున్న ఘటనలో నలుగురిపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం బసవతారక కాలనీ పరిధిలో బానోత్ భద్రుకు 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కొన్నేళ్ల క్రితం జామాయిల్ వేశాడు. కానీ అతనికి తెలియకుండా అతని సోదరుడు వీరూనాయక్, అతని కుమారులు రమేస్ నాయక్, సురేష్ నాయక్, అల్లుడు గోపాల్‌లు ఆ జామాయిల్ కర్రలను నరికించి అమ్మి సొమ్ము చేసుకున్నారు. విషయం తెలుసుకుని భద్రూ నాయక్ కుమారుడు భార్గవ్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు బాధ్యులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

భద్రాద్రిలో సంప్రదాయబద్ధంగా దొంగలదోపు

» గోదావరిలో సీతారాములకు తెప్పోత్సవం » కొనసాగుతున్న నవాహ్నిక బ్రహ్మోత్సవాలు



తెప్పోత్సవంలో సీతారామచంద్రస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 20: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతారామచంద్రస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ రాముడికి శనివారం దొంగల దోపోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ ఉత్సవాన్ని వేలాది మంది భక్తులు ఆహ్లాదకరంగా తిలకించారు. ఈ సమయంలో పరకాలుడు వేషధారి స్వామివారి శంఖుచక్రాలు, గొడుగు చోరీ చేయగా వాటిని భటులు స్వాధీనం చేసుకొని నిందితుడి స్వామివారి ముందు ప్రవేశపెడతారు. ఈ సమయంలో నిందితుడు తప్పు ఒప్పుకొని స్వామివారిని క్షమించమని కోరతాడు. ఈ క్రమంలో పెరయ తిరుముడిలోని తొలి పది పాశురాలను అనుసంధానం చేసి పరకాలుడు వేషదారుడికి, భటులకు సన్మానం చేస్తారు.

ఈ దొంగలదోపు ఉత్సవంపై ఓ కథ విశేష ప్రచారంలో ఉంది. 'తిరుమంగై ఆళ్వార్ ఓ మండలానికి రాజుగా ఉంటాడు. ఆయనకు పరకాలుడు అనే పేరు కూడా ఉంది. కుముదవల్లి అనే అప్సరస శాపం కారణంగా మానవరూపంలో జన్మించడంతో ఆమెను వివాహం చేసుకోవాలని భావిస్తాడు. తిరుమంగై ఆళ్వార్ రోజుకు వెయ్యి మందికి (తదియారాదనచేస్తే అన్నదానం) ఏడాది పాటు చేయాలని కొముదవల్లి పేర్కొంటుంది. దీంతో ఆ ఒప్పందంతో ఏడాది పాటు రోజుకు వెయ్యిమందికి తిరువారాదన నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఆస్తి మొత్తం కరిగిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తన వద్ద ఉన్న నలుగురు నమ్మకమైన సహచరులతో కలిసి రాత్రిపూట దారి దోపిడీలు చేస్తాడు. ఆయన కేవలం ధనవంతుల వద్ద సొమ్మును అపహరించి దాన్ని ప్రతిరోజు తదియారాదనకు వినియోగించేవాడు. ఈ క్రమంలో ఒకరోజు లక్ష్మీ సమేతుడైన శ్రీ మహావిష్ణువు మానవరూపంలో తిరుమంగై ఆళ్వార్‌కు తారస పడతారు. దీంతో తిరుమంగై ఆళ్వార్ స్వామి వారి వద్ద ఉన్న ఆభరణలన్నింటినీ చోరీ చేసి చివరకు స్వామివారి కాలికి ఉన్న కడియంను ఇవ్వమని కోరతాడు. అయితే అందుకు నిరాకరించి "నువ్వే ప్రయత్నించు" అని శ్రీమన్నానారయణుడు తిరుమంగై ఆళ్వారుకు సూచిస్తారు. దీంతో స్వామివారి కాలికి ఉన్న కడియంను తీసే క్రమంలో స్వామి పాదస్పర్శతో తిరుమంగై ఆళ్వార్‌కు జ్ఞానోదయం అవుతుంది. ఇదే సమయంలో ఆయనకు అనర్గళంగా ఆశు కవిత్వం వస్తుంది. దీంతో ఆయన వెయ్యి పాశురాలు ఉన్న 'పెరియ తిరుముడి' అనే ప్రబంధంతో పాటు మరో ఐదు ప్రబంధాలను స్వయంగా రచించాడు. చివరకు వాటిని శ్రీరంగనాయకస్వామికి కైంకర్యం చేసి స్వామివారి సాన్నిధ్యం పొందాడు. దొంగలదోపు కార్యక్రమానికి ముందు గోదావరి నదిలో రామయ్య, సీతమ్మలకు తెప్పోత్సవం నిర్వహించారు.



దొంగలదోపోత్సవంలో పాల్గొన్న ఈవో రమాదేవి



దొంగలదోపు కార్యక్రమంలో సీతారాములు

అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు వాహనాల సీజ్



మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

రఘునాథపాలెం, ఏప్రిల్ 20: అక్రమంగా మట్టి తోలకాలు నిర్వహిస్తున్న లారీ, రెండు ఎక్స్‌కవేటర్లను మైనింగ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. రఘునాథపాలెం గుట్ట నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నరన్న సమాచారం మేరకు దాడి చేసి లారీ, రెండు ఎక్స్‌కవేటర్లను పట్టుకున్నారు. కాగా ఆదే సమయంలో రఘునాథపాలెం నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం అదే ప్రాంతానికి అధికారికంగా మట్టి తొలకం వచ్చిన లారీని ఎందుకు సీజ్ చేయడం లేదని ముందుగా సీజ్ చేసిన లారీల వ్యక్తులు మైనింగ్ అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో అధికారులు గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాన్ని సీజ్ చేసి శనివారం విడుదల చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● 9మందిపై కేసు నమోదు

జూలూరుపాడు, ఏప్రిల్20: వెంగన్నపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ సమీపంలోని ఓ హోటల్‌లో జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన 9 మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌ఐ జీవన్‌రాజు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని 6ద్విచక్రవాహనాలు, 10 సెల్ ఫోన్లతోపాటు రూ. 34,500ల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జమలాపురంలో ముత్యాల కవచ అలంకారంలో శ్రీవారు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 20: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణవేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణాన్ని జరిపించారు. ఆలయ సిబ్బంది శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు.

రూ.లక్ష వితరణ

అదే విధంగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన భక్తుడు గుంటక సీతారెడ్డి దంపతులు శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయలను వితరణ చేశారు. దాతకు దేవస్థానం తరఫున శేష వస్త్రాలు, ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్, మారుతిరావు, మస్తాన్ పాల్గొన్నారు.



ఆలయ ప్రధాన అర్చకుడికి రూ.లక్షను విరాళంగా అందిస్తున్న దాతలు గుంటక సీతారెడ్డి దంపతులు

పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమ జంట



పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమ జంట

కరకగూడెం, ఏప్రిల్20: పెద్దల సమక్షంలో ఓ ప్రేమ జంట ఒక్కటైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలోని సీతరంపురం గ్రామానికి చెందిన గొగ్గలి రవి, పద్మ దంపతుల కుమార్తె లక్ష్మీ ప్రసన్న, అదే గ్రామానికి పోలెబోయిన నర్సయ్య, నాగలక్ష్మి కుమారుడు శేఖర్‌కు శనివారం కరకగూడెంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెద్దల సమక్షంలో పెళ్లి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీ ప్రసన్న, శేఖర్ హైదరాబాద్‌లో చదువుతున్నారు. అక్కడే పరిచయంతో ప్రేమ మొదలైంది. ఈ విషయమై ఇరు కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటు చేసుకుంది. వివాదం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. పెద్దల సమక్షంలో ఇటీవల రెండు కుటుంబాలతో చర్చించినా పరిష్కారం కాకపోవడంతో శనివారం గ్రామ పెద్దలు వారికి పెళ్లి జరిపించారు. అనంతరం పెద్దలు ప్రేమ జంటను అత్తవారి ఇంటికి చేర్పించారు.

ఉగాది క్యాలండర్ ఆవిష్కరణ

మణుగూరు, ఏప్రిల్ 20: హైందవశక్తి ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది క్యాలండర్‌ను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం తన స్వగృహంలో ఆవిష్కరించారు. తెలుగు సంవత్సరాది క్యాలండర్‌ను రూపొందించిన హైందవ శక్తి కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, గాండ్ల సురేష్, గణేష్ రెడ్డి, హైందవశక్తి కార్యకర్తలు రేణం శ్రీకాంత్, దేవల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం

మండుతున్న ఎండలు.. ప్రజల అవస్థలు

10 గంటలు దాటితే బయటకు రావడానికి జంకుతున్న జనం

అడుగంటిన చెరువులు, ప్రాజెక్టులు

పశువులకూ తప్పని తాగునీటి కష్టాలు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 20: కొద్దిరోజులుగా మండుతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలాడుతున్నారు. ఉదయం 10గంటలకు దాటితే బయటకు రావాలంటేనే ప్రజలు గజగజలాడుతున్నారు. ఓ వైపు ఎండలు, మరో వైపు ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తప్పనిసరై పని ఉండి బయటకు వస్తే ఎండకు అల్లాడిపోవాల్సిన పరిస్థితి. దీంతో మధ్యాహ్నం వేళ నిత్యం రద్దీగా ఉండే రహదారులు జనం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి.


నిర్మానుష్యంగా అశ్వారావుపేట ప్రధాన రహదారి

40 డిగ్రీలకుపైగానే ఎండలు

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వర్షాలు, జల్లులు పడుతున్నా అశ్వారావుపేటలో మాత్రం జల్లులే లేవు. అశ్వారావుపేటలో గత నెలరోజులుగా ఎండలు మండుతూనే ఉన్నాయి. నిత్యం 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి తప్ప తగ్గుదల కనిపించటం లేదు. పెరిగిన ఎండలతో అన్ని వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ కూలీలు, ఉపాధిహామీ కూలీలకు ఉదయాన్నే పనులకు వెళ్లి 9గంటలకే ఇంటికి చేరుతున్నారు. పట్టణాలతో సైతం ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వస్తుండటంతో రహదారులు అన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వాహనాలు కూడా ఎండలకు ముందుకు సాగలేక చెట్ల కింద సేదతీరుతున్నాయి. తప్పనిసరై వివిధ రకాల పనుల కోసం బయటకు వచ్చే ప్రజలు ఎండలకు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎండలకు బయటకు వస్తే రెండుమూడు రోజుల పాటు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పెరిగిన ఎండలకు వ్యాపార సముదాయాలు కూడా మధ్యాహ్నం వేళ కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. కొందరు అయితే దుకాణాలను మూసి ఇంటికి వెళుతున్నారు. పెరిగిన ఎండల వలన కొబ్బరిబొండాలు, జ్యూస్ దుకాణాల వద్ద గిరాకి నెలకొంది.

ఎండిపోతున్న చెరువులు.. పశువులకు తప్పని ఇబ్బందులు

గణనీయంగా పెరిగిన ఎండలతో గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, ప్రాజెక్టులు పూర్తిగా నిండుకుంటున్నాయి. అక్కడక్కడా చెరువుల్లో కొద్దిగా


అడుగంటిన పెదవాగు ప్రాజెక్టు

నీరు ఉన్నా అవి కూడా భారీగా పెరిగిన ఎండలకు ఆవిరవుతున్నాయి. చెరువుల్లో నీరు లేకపోవటంతో పశువులు తాగునీటి కోసం తహతహలాడుతున్నాయి. మేతకు వెళ్లి పశువులు ఎండలకు తాళలేక చెట్ల కింద సేదతీరుతూ నీటి కోసం వెతుక్కుంటూ చెరువులు, కుంటల వద్దకు వెళితే అక్కడ నీరు లేకపోవటంతో అల్లాడిపోతున్నాయి. కొందరు పశు యజమానులు అయితే పశువులను బయటకు కూడా వదిలిపెట్టటం లేదు. ఇంట్లోనే ఉన్న గడ్డిని వేసి పెంచుతున్నారు. ఎండలకు పశువులకు గడ్డి కూడా దొరక్కపోవటంతో పశువులు అల్లాడిపోతున్నాయి. భూగర్భజలాలు కూడా పడిపోతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పటం లేదు. మొత్తంగా మండుతున్న ఎండలకు అటు ప్రజలు, ఇటు పశువులు కూడా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి.

అక్రమంగా మట్టి తవ్వకాలు


ఎక్స్‌కవేటర్‌తో చింతలచెరువు శిఖం భూమిలో తవ్వుతున్న దృశ్యం

అశ్వాపురం, ఏప్రిల్ 20: మండలంలోని పలు చెరువులనుంచి యంత్రాల సహాయంతో అక్రమంగా మట్టి తరలిస్తున్నా..పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. రేయి,పగలు తేడాలేకుండా ట్రాక్టర్ల సహాయంతో మట్టి తరలిస్తూ కొందరు వ్యక్తులు లక్షలు ఆర్జిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే అక్రమం జరుగుతోందన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. ఇంటి అవసరాలకు ఏజెన్సీ ప్రాంతంలో పట్టా భూములనుంచి మట్టి తరలించుకునే అవకాశం ఉన్నా, కొందరు అక్రమార్కులు చెరువుల శిఖం భూములపై కన్నేసి రోజుకు వందలాది ట్రాక్టర్ల మట్టి తరలించుకుపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోక పోవటం విస్మయాన్ని కలిగిస్తోంది. చింతల చెరువు నుంచి కొద్ది రోజులుగా కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సహాయంతో మట్టిని తరలిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. అశ్వాపురం పరిసర ప్రాంతాల్లో మట్టికి ఇటీవల విపరీతమయిన డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా అక్రమార్కులు ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.400నుంచి రూ.500కు విక్రయిస్తులక్షలు ఆర్జిస్తున్నారు. ఇటుక బట్టీలకు కూడా ఇదేమట్టి తరలివెళుతోంది. ఇంతజరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్సీపై వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

జూలూరుపాడు, ఏప్రిల్ 20: ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతామధుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కారేపల్లి మండలానికి చెందిన సోమందుల నాగరాజుపై చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు జడ్పీటీసీ భూక్య కళావతి, వైరా నియోజకవర్గ సభ్యులు లకావత్ గిరిబాబు కోరారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మాచినేనిపేట తండా గ్రామశాఖ అధ్యక్షుడు లకావత్ హేమ్లా శనివారం జూలూరుపాడులో పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీపై వ్యాఖ్యలు చేయటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి డైరెక్టర్ భూక్య జవహర్, నాయకులు సేవ, చందర్ తదితరులు పాల్గొన్నారు.

'పోరిక' గెలుపు కోసం కృషి చేయాలి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 20: మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. తొలుత కె.లక్ష్మీపురంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. కన్నాయిగూడెంలో దారుణహత్యకు గురైన ఎంపీటీసీ బాలకృష్ణ కుటుంబ సభ్యుల్ని మారేడుబాకలో కలిసి ఓదార్చారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు వి విసీల్, చింతిరాల రవికుమార్, పూజారి సూర్యచంద్రరావు, కనుబుద్ది దేవా, అప్పలరెడ్డి, నటరాజస్వామి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి చేయూత

భద్రాచలం, ఏప్రిల్ 20: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న భద్రాచలంకు చెందిన అప్పలరెడ్డికి మనూష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ అర్బన్ చిల్డ్రన్స్ అనే స్వచ్ఛంద సంస్థ రూ.5 వేలు విలువ చేసే నిత్యవసర వస్తువులను అందించి ఆదుకుంది. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులైన ఎం.విజయలక్ష్మి మాట్లాడుతూ మనూష్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారికి చేయూతనందించడం జరుగుతుందన్నారు.

ఓసీల్లో పనివేళలు మార్చాలి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 20 : ఎండ వేడిమి నుంచి కార్మికులను రక్షించేందుకు సింగరేణిలోని ఓపెన్‌కాస్టు గనుల్లో యాజమాన్యం పని వేళలు మార్చాలని ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి కె.సారయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు ఏరియా జీఎంకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఎండల తీవ్రత పెరగడంతో కార్మికులు విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారని, రోజుకు 40డిగ్రీలపైనే ఎండతీవ్రత ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులకు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం పని వేళలు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బ్రాంచి కార్యదర్శి ఎండి. నజీర్, ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ముస్తఫా, కొరిమి సుందర్, సంజీవచారి, హుస్సేన్, గుగులోత్ కృష్ణ, లచ్చిరాం, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 20: కార్మికులు తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగుతూ పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య అన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని ఓబీ కంపెనీలు స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. సింగరేణిలో కాంట్రాక్ట్ పద్దతిన జరిగే ప్రతీ పనిలో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరు హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహిస్తూనే ఏఐటీయుసి బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఆర్ లక్ష్మీనారాయణ, దుర్గ్యాల సుధాకర్, ఆదెర్ల సురేందర్, గడ్డం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, రాము, అవినాష్, బోసెట్టి సంపత్, ప్రసాద్, అన్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయంలో మెచ్చా పూజలు

దమ్మపేట, ఏప్రిల్ 20: దురుదపాడు అంకమ్మతల్లి తిరనాళ్ల మహోత్సవం సందర్భంగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం అంకమ్మతల్లిని దర్శించి పూజలు చేసారు. అనంతరం ఆలయకమిటి ఆధ్వర్యంలో మెచ్చాను సత్కరించారు. నాచారం గ్రామంలో అనారోగ్యంతో ఉన్న చీకటి పుల్లయ్యను పరామర్శించారు. అదే గ్రామంలో వివాహ వేడుకలో మెచ్చా పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

అశ్వారావుపేట, ఏప్రిల్ 20: ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషిచేస్తానని, ప్రధానంగా పేద ఆర్యవైశ్యల ఉన్నతికి తన వంతుగా పాటుపడతానని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు పల్లపోతుల వాసు హామీ ఇచ్చారు. అశ్వారావుపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం మండల ఆర్యవైశ్య సంఘ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు వాసు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి అందరం సమష్టిగా పనిచేద్దామన్నారు.

ఎస్వోటు జీఎంకు కార్మికుల వినతి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 20: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో రోజురోజుకు ఎండలు మండి పోతున్నాయి పని వేళలను మార్చాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు శనివారం ఎస్వోటు జీఎం శ్యాంసుందర్‌కు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎం.నాగేశ్వరరావు మాట్లాడారు. ఏరియాలో అత్యధిక ఉష్ణోగ్రతల నేపధ్యంలో పారిశుద్యం, రోడ్ క్లీనింగ్, ఉద్యానవన కాంట్రాక్ట్ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం పనివేళలను మార్చాలన్నారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో నిర్వాసితులకు, ఉపాధి కోల్పోయిన వార్డు బాయ్‌లకు న్యాయం చేయాలని, కాంట్రాక్టర్‌ల అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం నిర్వహించిన పరుగు పందెంలో అర్హత సాధించిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఏడాది మార్చి 31 వరకు అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల సీఎంపీఎఫ్ జమ వివరాలతో కూడిన పాస్‌బుక్‌లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుమూర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సత్యవతి, రమణ, నాగమణి, రమాదేవి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు చేస్తున్న ఖర్చులను క్షుణ్ణంగా పరిశీలించాలని మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాంకుమార్ గోపాల్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల బృందాలు ఎంసీసీ, ఫ్లైయింగ్‌స్క్వాడ్స్, వీవీటీ, వీఎస్టీ, అకౌంటింగ్ బృందాలతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వ్యయాలను చేసే విధానాన్ని పరిశీలించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లైతే అయా అభ్యర్థులకు నోటీసులు జారీ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల నిబంధనలు అమలు అయ్యే విధంగా అన్ని బృందాలు పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారి (ఎక్స్‌పండేచర్) సయ్యద్


మాట్లాడుతున్న రాంకుమార్ గోపాల్

ఖుర్షిద్, లైజనింగ్ అధికారి తిరుపతయ్య, జనరల్ మేనేజరు ఇండస్ట్రీస్ కాశయ్య, అదనపు రిటర్నింగ్ అధికారి సీహెచ్. కోటయ్య, అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు కె.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం కూలీలు పనిచేయాలి

డీఆర్‌డీవో పీడీ విద్యాచందన

జూలూరుపాడు, ఏప్రిల్ 20: ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనిచేసినట్లయితే ప్రభుత్వం అందించే రోజు వారి వేతనం రూ.300లు గిట్టుబాటు అవుతాయని డీఆర్‌డీవో పీడీ విద్యాచందన తెలిపారు. శనివారం ఆమె మండలంలోని గుండెపుడి పంచాయతీ పరిధిలో జమ్మికుంట చెరువులో కూలీలు చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. కూలీల మస్టర్ రిజిస్టర్, పని ప్రదేశాలలో కల్పించిన వసతులను తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి వివరాలను సేకరించి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులను చేయాలని తెలిపారు. పని ప్రదేశాలలో కూలీలకు పంచాయతీ వారి ఆధ్వర్యంలో తాగునీరు, నీడ సౌకర్యం, మెడికల్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు రాజకీయ పార్టీల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. వేసవిలో


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ విద్యాచందన

గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఏపీవో రవి, పంచాయతీ కార్యదర్శి హరిక, టీఏ జోధాబాయి, ఎఫ్ఏ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన 'హరితహారం'


నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 20: గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సరీలు లక్ష్యానికి చేరకుండానే నీరుగారిపోయి ఎండిపోతున్నాయి. ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని 24వార్డుల్లో ప్రతి సంవత్సరం హరితహారం ద్వారా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలను సరఫరా చేసే నర్సరీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. పట్టణంలోని 12వ వార్డు నిర్వాసిత కాలనీలో ఏర్పాటు చేసిన పట్టణ నర్సరీలో మొక్కలన్నీ ఎండిపోయి దర్శనమిస్తోన్నాయి. అయితే జూన్, జూలై నెలల్లో చేపట్టాల్సిన హరితహారానికి ముందస్తుగానే ప్రణాళికలను రూపొందించి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా సంబంధిత మున్సిపల్ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా ఇప్పటి వరకు నామమాత్రంగానైన ఏర్పాటు చేయలేకపోయారు. గత సంవత్సరం వేసిన మొక్కలకు ఎలాంటి పోషణ లేకపోవడం, నీరు అందకపోవడంతో ఎండిపోయి పనికి రాకుండా పోయాయి. ఇల్లెందు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నర్సరీని పర్యవేక్షించాల్సి ఉండగా అందుకు కనీస చర్యలు లేకపోవడంతో హరితహారానికి మొక్కలు సిద్ధమవుతాయా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ యాదగిరి వివరణ కోరగా.. పట్టణంలో హరితహారం మొక్కలను పెంచేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సరీలో మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చేవిధంగా మహిళా గ్రూపుల ద్వారా నర్సరీలో మొక్కలు పెంచే చర్యలకు పూనుకున్నామని పేర్కొన్నారు.

కొత్త వ్యక్తుల సమాచారం ఇవ్వాలి: ఎస్ఐ

కరకగూడెం, ఏప్రిల్ 20: వలస ఆదివాసీ గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపారు. శనివారం వలస ఆదివాసీ గ్రామంలో అయిన నీలాద్రిపేట గ్రామంలోని గ్రామస్తులతో సమావేశంలో ఏర్పాటు చేసిన ఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ.. మావోయిస్టులు మండలంలో సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వారికి ఆసరం కల్పించోద్దని వారికి సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని వారికి పోలీస్ శాఖ నుంచి పునరావాసం కల్పిస్తుందని తెలిపారు. కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం తాటిగూడెం వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహ


వలస ఆదివాసీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేందర్

నాల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల సామాగ్రి పరిశీలించారు. అనుమానితులుగా కనిపించిన వారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

మణుగూరు, ఏప్రిల్ 20: మణుగూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ సెంటర్‌లో, నియోజకవర్గ కార్యాలయాల్లో వాసిరెడ్డి చలపతిరావు ఆధ్వర్యంలో కొంతమంది పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనగా, న్యాయవాది, పార్టీ నాయకులు మేదరమెట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మరికొందరు నాయకులు కలసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. ఈ కార్యక్రమాల్లో సమితి సింగారం సర్పంచ్ బచ్చల భారతి, తెలుగుదేశం నాయకులు దొడ్డి కృష్ణ, అబ్దుల్ నబీ, గాంధీ, రాంబాబు, బాగం రవి, ఎం భద్రయ్య, యార్లగడ్డ రాజ, చావా రామారావు, పూర్ణ, బచ్చల సుమేష్, రాము, చావా శ్రీదేవి, రమా తదితరులు పాల్గొనగా మరో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మేదర మెట్ల శ్రీనివాస్‌తో పాటు పసునూరి సీతమ్మ, మేదరమెట్ల నాగేశ్వరరావు, సినియర్ నాయకులు పసునూరి కృష్ణ, ఎం శాంతి, సరిత, కళ్యాణి, అనసూర్య, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందులో వేడుకలు

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను మండల తెలుగుదేశం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ములకపాడు సెంటర్లో కేక్ కట్ చేశారు. ఏపీ రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు లాంటి విజన్ ఉన్న లీడర్ ఎంతో అవసరమని మండల అధ్యక్షుడు కొమరం దామోదరావు అన్నారు. కెల్లా వేణుగోపాల్, పాతూరి ప్రసాద్, శ్రీరాములు, బాస్కరాచారి, లక్ష్మయ్య, వీరాస్వామి, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందుటౌన్: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఇల్లెందులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ముద్రగడ వంశీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాయని ప్రశంసించారు. ప్రజలు ఆత్మవిశ్వాసంతో ఎదిగేవిధంగా పథకాలు రూపొందించారని కొనియాడారు. ప్రతి వ్యక్తికి అవకాశాలు కల్పించేవిధంగా నాలుగు దశాబ్దాలపాటు రాజకీయాల్లో నీతి, నిజాయితీతో పని చేస్తున్నారని వెల్లడించారు. విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి తెలుగురాష్ట్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ పఠంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకురావడంలో చంద్రబాబు నాయుడు పాత్ర ఎంతో అమోఘమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఏపీలో టీడీపీ అధికా రంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందావత్ రమేష్‌బాబు, సీనియర్ నాయకులు శ్యాంతివారి, మట్టెల రత్నాకర్, కడారి నట్రాజ్, దాసరి గోపాలకృష్ణ, ప్రసాద్, పాషా, వాసం వినీత్, దేవరకొండ నవీన్, శ్రీవేద్, శ్రీకాంత్, నిఖిల్, రాకేష్, ఆటోజానీ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

భద్రాచలంలో..

భద్రాచలం: నారా చ్రంబాబునాయుడు 74వ జన్మదిన వేడుకలను శనివారం భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకి పరిచయం చేసి, దేశంలోనే నెంబర్‌వన్ స్థాయికి ఆంధ్రప్రదేశ్‌ను తీసుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి కాబోయే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొడాలి శ్రీనివాస్, షేక్ అజీమ్, కంభంపాటి సురేష్‌కుమార్, కుంచాల రాజారాం, దుక్కిపాటి ప్రకాష్, పోటు నరసింహారావు, పసుపులేటి రాంబాబు, నర్రా రాము, సురేష్, బత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.